





1977

"మే ఐ కమిన్ మేడం ?"

" ఎసెస్ ! కమిన్ !" " రాసిన కొత్తకథేదో చకచకా ఫేర్ చేస్తూ అంది జయ. ఆ అమ్మాయి లోపలికి వచ్చినసవ్వడి విన్పించి: "ఏమిటీ ! ఏం కావాలమ్మా?" అడిగింది జయ తలెత్తకుండానే.

"షాపింగ్‌కి వెళ్దామనుకుంటున్నామండీ" చెప్పిందా అమ్మాయి.

"సరే ! అలాగే ! ఆరు గంటల్లోపున వచ్చేసేయాలి, క్షణం ఆలస్యమైనా వూర్కోను మరి. ఇంతకీ ఎంతమంది వెళ్తున్నారు?" తన మామూలు ధోరణిలో అడిగింది జయ.

"ఇద్దరమండీ."

"ఎవరెవరూ?"

"నేనూ - మీరూ"



విస్మయంగా తలెత్తిన జయకి - డోర్ దగ్గర చిరునవ్వు చిందిస్తూ చిలిపిగా తన వంకే చూస్తోన్న స్నేహితురాలు నిర్మల కన్పించింది! పెన్ టేబుల్ మీద పడేసి "హాయ్ హాయ్ - నిమ్మీ! ఎప్పుడొచ్చావ్?" అంటూ ఒక్కుదుటన వెళ్ళి వాటేసుకుంది.

"మొద్దూ? భలేగా ఫూల్ చేశావ్ నన్ను! నేనింకా ఎవరో స్టూడెంట్ కాబోలనుకున్నాను.  -ఆ, ఇది చెప్పు మీ శ్రీవారు ఎలా వున్నారు? అరే - బాబుని తీసుకు రానట్టున్నావ్ - ఇంతకీ మీకా అండమాన్ లాంటి ఆదిలాబాద్ నుండి ట్రాన్స్ఫరయే యోగం లేదా? అబ్బ ! విశేషాలేవీ చెప్పకుండా ఏమిటే ఈ మూగనోమూ?"

సూట్‌కేస్ స్టూల్ పై పెట్టి మంచంలో కూలబడి నవ్వుతూ అంది నిర్మల: "కాస్త నన్ను వూపిరి తీసుకోనీవే తల్లీ ! ఒకటే ప్రశ్నల వర్షం ! నీ హడావిడీ, తొందరా- నువ్వు కొంచెంకూడా మారలేదే జయా! ' ఇక చెప్పొద్దు బాబోయ్ !' అనేదాకా విశేషాలన్నీ చెప్పి బోర్ కొట్టిస్తానుగానీ - ముందు వేడి వేడీ కాఫీ తెప్పించి పుణ్యం కట్టుకోవే"?

జయ హాస్టల్ ప్యూన్‌ని పిలిచి రెండు కాఫీలకి ఆర్డరిచ్చింది. బాత్‌రూంలో దూరి స్నానమదీ ముగించాక అడిగింది నిర్మల: " పెళ్ళీ పెటాకుల్లేకుండా ఈ వార్డెన్ కమ్ లెక్చరర్ వుద్యోగమేమిటో, నీకీ బుద్ధి పుట్టడమేమిటో నాకేమీ అర్థం కావట్లేదు'.

"అదంతేలే! నీలాంటి సంసార పక్షులకిది ఒక పట్టాన అర్థంకాదు గానీ ముందా కాఫీ ఏదో తాగమ్మా!" అంటూ ప్యూన్ తెచ్చిన కాఫీ నిర్మల కందించింది జయ.

"అయితే ఈ వుద్యోగం వదలనంటావ్?" కాఫీ సిప్ చేస్తూ అడిగింది నిర్మల.
"ఉహూఁ" తల అడ్డంగా అడించింది జయ.

" సరే నీ యిష్టం! కాని ఆ తర్వాత ఎప్పుడో ఒకప్పుడు నీ మార్గం బాగాలేదని బాధపడ్తే - గతించిన యవ్వనం తిరిగి రాదు! ఇప్పటికైనా మించిపోయిందేమీ లేదు! బాగా ఆలోచించి - ఈ వుద్యోగానికి రిజైన్ చేసి యింటికి వెళ్ళిపో"

" ఒక రోజు కాదు- రెండ్రోజులు కాదు -ఏకంగా అయిదేళ్ళు ఆలోచించాకే నేనీ నిర్ణయానికి వచ్చాను నిమ్మీ. ఒకవేళ ముందు నా జీవితం బాగా లేకపోతే సాయం చేయమని నిన్ను అడగన్లే!" అంది జయ.

దెబ్బతిన్నట్టుగా చూసింది నిర్మల. ఆమె ముఖంలో మారిన రంగులు గమనించి: " ఏదో సరదాకన్నమాటకి అంత బాధ పడ్తావేమిటీ?" అంది జయ నవ్వుతూ.

"లేదు జయా! నీవన్నది వినడానికి ఏదోలా వున్నా, అందులో వాస్తవం లేక పోలేదు. ఒకవేళ నువ్వేదైనా కష్టాల్లో చిక్కుకున్నా, నిన్నాదుకోలేని పరిస్థితులే నావి! భర్తా, కొడుకూ, అత్తా అనే ఈ సంసార బంధంలో ఇరుక్కున్న నేను, ప్రత్యేకంగా నీకే సాయమూ చేయలేను ! ఆ స్వేచ్ఛ నాకు లేదు ! మన స్నేహం తాలూకు మధురానుభూతులు కేవలం వూహాలోకం వరకే పరిమితంగానీ... వాస్తవంలో ఒకరి కష్టాలు మరొకరం పంచుకోలేం! ఒకర్నొకరం ఆదుకోలేం"

"హియర్ ! హియర్!" చప్పట్లు చరుస్తూ ఉత్సాహంగా అంది జయ: " అందుకే డియర్, నేనీ నిర్ణయం తీసుకుందీ ! చూడూ, ఒకప్పుడు నువ్వు నన్ను - నీ ప్రాణంకన్నా మిన్నగా ప్రేమిస్తున్నానని చెప్పావు. రాశావు. మరి ఇప్పుడు ఏం చేయగల్గుతున్నావనీ? నీ ప్రాణాన్నివ్వగలవా? అమ్మో, నీ ప్రాణవల్లభుడు వూర్కోవద్దూ? పోనీ నువ్వు నా దగ్గరే శాశ్వతంగా వుండిపోగలవా? పాపం నీ పండంటి బాబుని వదిలి - నాదగ్గర వూపిరి తీయగలవా? అందుకే ఈ సంసారపు ఝుంఝూటం లేకుండా నా జీవితాన్ని చివరంటా హాయిగా - గడపాలనీ, అందుకు ఈ వార్డెన్ వుద్యోగం కన్నా సురక్షితమైంది యింకోటి లేదనే నమ్మకంతో - భారతి మేడం రిజైన్ చేశాక ఆ స్థానాన్ని నేను ఆక్రమించుకున్నాను."

"పెళ్ళంటే నీకంత వైముఖ్యమున్నప్పుడు నీ కథలన్నింటినీ అంత ప్రణయ శృంగార రస భరితంగా ఎలా రాయగల్గుతున్నావే?"

"పాఠకులు అలాంటి కథలనే ఆదరిస్తారని, ఆ వెరైటీకి చెందిన కథలు రాశానేగానీ పెళ్ళన్నా, సంసారమన్నా ఏమిటో అర్థంలేనివిగా, అసహ్యంగా కన్పిస్తాయి!"

" ఇంకేం ఈ భావాలతో ఓ నవల రాసెయ్!"

"నాకూ రాయాలనే వుందే! కాని పాఠకులు ఎక్కడ చెప్పులు మెళ్ళో వేస్తారో

అని భయంగా వుంది.'''

" చూశావా? మన సమాజంలో నీ భావాలని హర్షించే వాళ్ళెవరూ వుండరని నీకు తెలీకుండానే ఒప్పుకున్నావే! ఊరంతా ఒక దారైతే ఉలిపికట్టెదొక దారన్నట్టుంది నీ కథ!"

జయ నవ్వి వూరుకుంది.

"ఎన్నాళ్ళయిందే మనంకలుసుకొని ? మూడేళ్ళు దాటాయి. ఆ రోజులు మళ్ళీ వస్తే ఎంత బావుణ్ణనిపిస్తోందే - " అంటూ అలా ఆరోజు అర్థరాత్రి దాకా - జయా నిర్మలా తాము కాలేజీలో ఎంజాయ్ చేసిన రోజుల గురించి కబుర్లు చెప్పుకుంటూనే వున్నారు.

❋❋❋❋❋❋

" ఏయ్ రంభా, లెట్ మీ సీ యువర్ ఫేస్ !" భయంభయంగా ఒక్కర్తే కాలేజీలో అడుగెట్టిన నిర్మలకి హఠాత్తుగా విన్పించిన మాటలకి వెనుదిరిగి చూసింది.

మామిడి చెట్టుకింద కొంతమంది అమ్మాయిలు నించుని నవ్వుతూ చూస్తున్నారామె వంక.

అసలే ఆ కాలేజీకి కొత్తేమో, అందులోనూ కాలేజీలోఒక్కర్తే అడుగెట్టిందేమో నిర్మలకి ముచ్చెమటలు పోశాయి. అయినా తనను కాదన్నట్టు ముందుకు నడిచింది.

"ఏయ్ నిన్నే! పిలుస్తూంటే ఏమిటా పొగరు ? ఇలారా ఒకసారి !"

కాలేజీలో ఫ్రెషర్స్‌ని టీజ్ చేస్తారన్న సంగతి తనకు తెలీనిది కాకపోయినా, స్వానుభవంలోకి వచ్చేసరికి నిర్మల గుండె వేగంగా కొట్టుకోవడం మొదలెట్టింది. తన భయాన్ని పైకి కన్పించనీయకుండా - అలా వూరుకుంటే ఇంకా ఎక్కువ టీజ్ చేస్తారని - లేని ధైర్యం కూడగట్టుకుని వాళ్ళ దగ్గరకు వెళ్ళి:

" ఏం కావాలీ ? ఎందుకు రమ్మన్నారు"? అడిగింది నిర్మల.

"ఏం చదువుతున్నావోయ్!" అంది అందులో ఎర్రగా - అందంగా - ఆకర్షణీయంగా వున్న ఒకమ్మాయి.

ఆమె కంఠ స్వరాన్ని బట్టి ఇందాక తనను పిలిచింది ఈ అమ్మాయేననీ... చూడటానికి ఆ పిల్ల ఎంత అమాయకంగా కనిపిస్తుందో.... మనిషి అంత అల్లరిదనీ... గ్రహించింది నిర్మల.

"పీయూసీలో జాయినయ్యాను - మీరు ?"

"బి.ఏ సెకండియర్. అద్సరేగానీ... నీకు ఇంగ్లీష్ మాట్లాడ్డం వచ్చా?"

"ఫ్లూయంట్‌గా వచ్చు! ఎందుకూ?"

" నాకు రాదు ! నేర్పుతావేమోనని..."

ఏదో మాటలుపెంచి తనను ఏడ్పించడానికే ఆ పిల్ల అలా మాట్లాడుతోందని అర్థం చేసుకుంది నిర్మల.

"మీ పేరు.............?"

" జయ"

" స్వీట్ నేం! ఐ లైకిట్ వెరీమచ్"

" మరి మీ పేరు చెప్పనేలేదు" అంది ఆ గ్రూప్‌లోని ఒకమ్మాయి.

"ఇందాక మీరు పిలిచారుగా!"

"ఎప్పుడూ - ఏమనీ ?" ముఖం ముఖం చూసుకున్నారు.

" రంభ అనీ........?"

" ఓస్...! అదా? ఏదో నిన్నేడ్పించడానికలా పిలిచాం గానీ చూడబోతే నువ్వు గడుసుదానిలాగే కన్పిస్తున్నావే!" అంది ఓ ఎర్రచీరమ్మాయి.

" అయినా నన్నాపేరుతో ఎందుకు పిలిచారు?"

" ఆ - ఏంలేదూ! మా జయ ఎవరి తల్లోనైనా పూలు కన్పిస్తేచాలు... 'రంభలా ఎలా ముస్తాబైందో చూడూ'అంటుంది ! అందుకని పువ్వులు పెట్టుకున్న వాళ్ళెవరు కన్పించినా - 'రంభా' అని పిలవడం అలవాటై పోయింది." అంది మరో పంజాబీ డ్రెస్సు.

అప్రయత్నంగానే వాళ్ళ తలల వంక చూసింది నిర్మల. ఎవరి తల్లోనూ పువ్వుల్లేవు పూలు పెట్టుకోకపోవడం ఫ్యాషనేమో అనుకుంది. అదే విషయం అడిగింది.

" ఫ్యాషన్ కాదు, గాడిద గుడ్డూ కాదు. నాకేవిటో పూలు పెట్టుకున్న వాళ్ళను చూస్తే భలే చిరాకేస్తుంది! కొందరు చెట్టుకు పూచిన పూలన్నీ తల్లో పెట్టుకుని పెళ్ళి కూతుళ్ళలా కాలేజీకి వస్తారు. అలాంటి వాళ్ళను చూస్తూంటే నాకెందుకో పురాణాల్లో వర్ణించే రంభలూ, మేనకలే గుర్తొస్తుంటారు!" అంది జయ నవ్వుతూ.

నిర్మల పెదాలపై చిరునవ్వు లాస్యం చేసింది.

" అయితే మీరెప్పుడూ పూలు పెట్టకోరన్నమాట!" అడిగింది నిర్మల.

" రామ! రామ! అంత పాపానికి ఒడిగట్టే కిరాతకురాల్నికాదు...! అటు చూడండి... మన గార్డెన్‌లో విరగబూసినపూలని! ఆ పూలతో ఆ చెట్లు ఎంత అందంగా కన్పిస్తున్నాయో !? ఆ పూలు లేకుండా ఆ చెట్లని ఊహించుకుంటే ఎంత బోసిగా వెలవెలబోతూ వుంటాయో ఆలోచించండి."

" ఆ సంగతి అందరికీ తెలిసిందే ! కాకపోతే మన ఆడవాళ్ళ హృదయం వుంది చూశారూ, అది పూలను చూశాక వూరకే వుండదు!"

"నాకదే విచిత్రంగా వుంటుంది. ఆడ వాళ్ళ హృదయాన్ని నవనీతంతో పోలుస్తారీ కవులు... కానీ - పూలని ఇంత నిర్దాక్షిణ్యంగా తెంపగలిగే వీళ్ళా సున్నిత హృదయులు..." జయ మాట్లాడుతూనే వుండలా...

హఠాత్తుగా ఓ అమ్మాయి దూసుకువస్తూ: "ఏయ్ జయా! కొత్త అమ్మాయిల గ్రూప్ ఇంకొకటి వస్తోంది! టీజ్ చేద్దామా?" అంది.

'బహుశ కొత్త అమ్మాయిలు వస్తున్నారో లేదో చూడటానికి గేట్ దగ్గర

కాచుక్కూర్చున్నట్టుందీపిల్ల' అనుకుంది నిర్మల.

రెడీ అంటే రెడీ అనుకున్నారు. ఏం జరుగుతుందో చూడాలని నిర్మల కూడా వాళ్ళ దగ్గరే నించుంది.

కొత్త పిల్లలు వచ్చి బిత్తర చూపులతో కారిడార్లో తిరిగి కాస్సేపు నోటీస్ బోర్డుదగ్గరికి వచ్చి - టైమ్ టేబుల్ రాసుకుని - రూమ్ నెంబర్ టెన్ ఎక్కడవుందా అని వెదుకుతున్నారు. ఏ రూంకి కూడా నెంబర్స్ లేవు.

" నెంబర్ ప్లేట్స్‌పై సీనియర్స్ కాగితాలంటించేశారు - రూం నెంబరేమిటో తెలియనీయకుండా. ఇప్పుడెలా? అక్కడ మరో సీనియర్స్ గ్రూప్ వున్నట్టుంది ! వాళ్ళను అడుగుదాం రావే'' అంది - అందులో కొంచెం బోల్డ్‌గా కన్పించే ఒకమ్మాయి.



"బాబోయ్! వాళ్ళు ఏడ్పిస్తారేమో! నేను రాను!" అంది ఇంకో అమ్మాయి.

చివరకు ఆ అమ్మాయితో రావడా నికి ఎవ్వరూ ఒప్పుకోలేదు. అయినా ఆ అమ్మాయి ధైర్యం చేసి ఒక్కర్తే వీళ్ళ వద్దకు వచ్చి:

"రూం నెంబర్ టెన్ ఎక్కడుందో దయచేసి చెప్తారా?'' అడిగింది.

జయ కళ్ళతో ఏదో సైగ చేసి తన పక్క నున్న ఫ్రెండ్‌ని వెళ్ళమని చెప్పింది.

''రండీ, చూపిస్తా'' అని వాళ్ళని వెంట బెట్టుకొని వెళ్ళిందా పంజాబీ డ్రెస్సు.

ఏం జరుగుతుందో చూద్దామని - వాళ్ళు వెళ్ళిన వైపే కుతూహలంతో చూస్తున్నారు- చెట్టుకింద నించున్నవాళ్ళు.

పంజాబీ డ్రెస్సు వాళ్ళకి కావల్సిన రూం చూపించి వచ్చేసింది.

వాళ్ళు లోపలికి వెళ్ళి మరుక్షణం కంగారుగా బయటికి వచ్చారు. చెట్టుకింద నించున్న సీనియర్సందరూ గొల్లుమని నవ్వారు. అప్పుడు చూడాలి - ఆకొత్తపిల్లల ముఖాలు అవమానంతో క్రుంగి నయాపైసంతయ్యాయి.

"ఏం జరిగిందసలు?'' అడిగింది నిర్మల జరిగిందేమిటో అర్థంగాక.

" ఆఁ ఏముంది? బాత్రూంలోకి పంపించినట్టుంది!'' అంది జయ నవ్వుతూ.

"పాపం!'' అన్పించింది నిర్మలకు.

మళ్ళీ ఎవర్ని అడిగితే ఏం కొంప మునుగుతుందోనని ఫస్ట్ డే క్లాస్‌కి వెళ్ళకున్నా ఫర్వాలేదు గానీ - క్లాసు రూమ్ మాత్రం ఎక్కడుందో ఎవర్నీ అడక్కూడదని కూడబలుక్కున్నారు - కొత్త పిల్లలు. ఎలాగూ వచ్చారు - అప్పుడే ఇళ్ళకి తిరిగి వెళ్ళడమెందుకని - లంచ్ టైం దాకా కాలేజీలోనే వుండాలని నిశ్చయించుకున్నారు. అప్పటిదాకా ఎక్కడ కూర్చోవాలో తెలీక - గేట్‌కి ఎదురుగా వున్న మామిడిచెట్టు

కింద కూర్చున్నారు.

సీనియర్స్ నించున్న మామిడిచెట్టు - ఆ కొత్త పిల్లలు కూర్చున్న మామిడి చెట్టుకి కొంచెం దూరంలో వుంది ! అక్కడి వాళ్ళు మాట్లాడుతున్న మాటలు యిక్కడి వాళ్ళకూ ఇక్కడి వాళ్ళు మాటలు అక్కడి వాళ్ళకూ విన్పిస్తాయి.

వాళ్ళాచెట్టు కింద కూర్చున్నారో లేదో, "అదేమిటీ? అక్కడ కూర్చున్నారు? లేవండి! ఎవరైనా సీనియర్స్ చూస్తే ఏడ్పిస్తారు! ఈ చెట్టు కింద కాలేజీ ప్యూన్స్ తప్ప ఎవరూ కూర్చోరు!" అంది జయ ఆశ్చర్యాన్ని నటిస్తూ..

"ఛీ" అనుకుని సిగ్గుతో కొత్తపిల్లలందరూ ఒక్కుదుటున నించుండి పోయారు. వెంటనే జయ తన పార్టీని తీసుకుని జూనియర్స్ యిందాక ఎక్కడైతే కూర్చున్నారో అదేచోట కూర్చుంది!

కొత్తపిల్లలు ఒకరి ముఖాలు మరొకరు చూసుకుని, మెల్లగా అక్కడి నుంచి తప్పుకుంటూంటే... వాళ్ళ అవస్థచూసి... సీనియర్స్‌కి ఎంత ఆపుకుందామన్నా నవ్వాగలేదు !

"నాటీగళ్" అనుకుంది నిర్మల జయను చూసి.

అలా జయావాళ్ళ గ్రూప్ ఆ ఫస్ట్‌డే క్లాసులకి వెళ్ళకుండా కొత్తపిల్లలను టీజ్ చెయ్యడం మొదలెట్టారు. నిర్మల కూడా వాళ్ళతోపాటు జతై జరుగుతోన్న వినోదం చూసింది.

ఆ మర్నాడు మామూలే -

సీనియర్స్‌ందరూ జూనియర్స్‌ని ఏమీ అనకుండా అసలు వాళ్ళ విషయమే పట్టించుకోకుండా తమ చదువులో మునిగిపోయారు.

ఒక వారం రోజుల తర్వాత నిర్మల హాస్టల్లో చేరింది. అక్కడ జయ కన్పించింది.

"అరె, మీరు.... ఇక్కడ?" ఆశ్చర్యం ప్రకటించింది నిర్మల.

" నేనీ హాస్టల్లో వుంటున్నాను." అంది జయ.

"అలాగా! అయితే నాకిక్కడ మీ కంపెనీ దొరుకుతుందన్నమాట!" మనసులోని సంతోషం మాటల ద్వారా వెళ్ళ గక్కింది నిర్మల.

"నాకు వార్డెన్ రూమ్ నెంబర్ థర్టీన్ ఎలాట్ చేశారు! దయచేసి అదెక్కడుందో చూపిస్తారా?!"

"వైనాట్ ? పద!" అంటూ దారితీసింది జయ !

"కొంపదీసి మళ్ళీ బాత్రూంనో, స్టోర్‌రూంనో ...

"నో.....నో... అలా చెయ్యను!" అంది నవ్వుతూ.

ఓ గది ముందు ఆగి తలుపులు నెట్టింది. లోపల బోల్ట్ వేసినట్టున్నారు. తలుపులు తెరుచుకోలేదు. టకటకా కొట్టింది.

" వెయిట్ బాబా! అయాం చేంజింగ్ మై డ్రెస్!" లోపల నుంచి ఒక అమ్మాయి కేక వేసింది.

“ ఇంకెంత సేపు డియర్! అరగంట నుంచీ నించున్నాను”

‘వచ్చి క్షణం కూడా కాలేదు. ఎంత గ్రాండ్ గా అబద్ధం చెప్తోంది’ అని నవ్వొచ్చింది నిర్మలకి.

పది నిమిషాలు గడిచాయి. ఆమె తలుపులు తెరవనేలేదు. బయట సామాన్లు తెచ్చిన రిక్షావాలా ఉన్నాడు. అతడికి డబ్బులివ్వాలి. చిల్లర సూట్‌కేస్‌లో వుంది. కారిడార్లో సూట్‌కేస్ తెరిస్తే ఏంబావుంటుందని - రూంకి వెళ్ళాక తెరిచి తీసి ఇవ్వొచ్చని అనుకుంది నిర్మల. కాని ఆ అమ్మాయి ఎంతకీ తలుపులు తీయక పోయే సరికి నిర్మలకి విసుగుపుట్టింది.

అది గమనించి జయ: “లోపల ఉన్న దెవరో తెలుసా? మెడికల్ కాలేజీ బ్యూటీ! దీని బ్యూటీ తగలడా - చీర కట్టుకోవడానికి సరిగ్గా అరగంట కావాలి. పైగా అది చీర కట్టుకున్నప్పుడల్లా అందరూ రూంలోంచి బయటికి వెళ్ళాలి? ఎవరి ముందూ చీర కట్టుకోదు. ‘అదేం?’ అంటే - సిగ్గంటుంది. దీని వేషాలు చూస్తూంటే - ఇది మన జాతికి చెందింది కాదేమో అన్పిస్తూంటుంది.” అంది.

నిర్మల నవ్వింది.

ఆమె నవ్వులో ఏదో ఆకర్షణ వుందనుకుంది జయ.

జయ మాటలు భలే సరదాగా వుంటాయనుకుంది నిర్మల.

మరో అయిదు నిమిషాలు చూసి సహనం కోల్పోయి తలుపులు దబదబా బాదేసింది జయ.

భళ్ళున తలుపులు తెరుచుకుని - రుద్రకాళిలా బయటకి వచ్చింది అరుణ.

“అబ్బ ఏం మనిషివే ! ఓపిక అనేదే లేదు ! ఓ అయిదు నిముషాలు బయట నించుంటే కాళ్ళేమైనా అరిగిపోతాయా?” అంది ధుమధుమలాడ్తూ.

“ అమ్మా ! మహంకాళీ ! తప్పయింది ! క్షమించి నీ కోపాగ్ని ఉపసంహరించు! లేకపోతే నాతోపాటూ - ఏమీ ఎరుగని ఈ కొత్తమ్మాయి కూడా భస్మమై ఆ పాపం నీకూ, నాకూ చుట్టుకుంటుంది!”

అప్పటికి గానీ అరుణ ఆ కొత్త అమ్మాయిని గమనించలేదు! సిగ్గుపడి పక్కకి తప్పుకుంది. నిర్మల లోపలికి వెళ్ళి సూట్ కేస్‌లోంచి చిల్లర డబ్బులు తీసి రిక్షావాలా కిచ్చి మళ్ళీ లోపలికి వచ్చింది.

“ ఈ అమ్మాయి పేరు నిర్మల” పరిచయం చేసింది జయ.

“హాయ్” చెప్పింది అరుణ.

“ఈ అమ్మాయి మెడిసిన్ ఫోర్తియర్ !మన హాస్టల్లోనే వుంటోంది! పేరు అరుణ. మేమంతా తుఫాన్ అని పిలుస్తూంటాం! ఆ పేరు ఈమెకెంత సూటయిందో ఈ అయిదు నిముషాల వ్యవధిలో గ్రహించే వుంటారు మీరు!”

జయ నవ్వుతూ చెప్తూంటే - అరుణ అవకాశం వస్తే నమిలి మింగేద్దామన్నట్టుగా- కొరకొరా చూసింది జయవంక.

"అయితే - అరుణా నేనూ - రూమ్మేట్స్ అన్నమాట!" అడిగింది నిర్మల.

"కాదు ! రూంకి ముగ్గురు చొప్పున వుండాలి!" చెప్పింది అరుణ

" మరి మూడో అమ్మాయి ఎక్కడా?"

"ఇక్కడే!"

"అంటే?"

"ఈ జయే!" అంది జయ నవ్వుతూ

"ఓహ్! మీరా! అయితే అదృష్టవంతురాలిని!"

"ఎందుకో"

"మీలాంటి సరదా మనుషుల పక్కన కాలంకూడా సరదాగానే గడుస్తుంది- అందుకూ"

జయ నవ్వి వూరుకుంది. ఆ రోజంతా నిర్మలకి హుషారుగా వుంది. అనుకోకుండా జయతో పరిచయమవడం, ఆవిడ తన రూమ్మేటే కావడం ఆమెకెంతో ఆనందాన్ని కల్గించింది.

నిర్మల వచ్చిన పావు గంటక్కాబోలు - పక్కరూంలోంచి ఓ అమ్మాయి పరుగెత్తు కుని వచ్చి: " ఇది అన్యాయం జయా! మీ రూంలోకి నేనొస్తానూ, నేనొస్తానంటూ ఓ వైపు ఇంతమంది పోట్లాడుకుంటూంటే-అందర్నీ కాదని ఎవరో కొత్త అమ్మాయిని తెచ్చుకున్నావ్!" అంది

" నేనేం చేయనే వార్డెన్ ఎలాట్ చేశారు. అంత ఇష్టమున్న దానివి - మొదటే పర్మిషనడిగి షిఫ్ట్ కాలేక పోయావా?"

"అడక్కపోవడమేమిటీ? రెండుసార్లడిగాను. 'చూస్తాను చూస్తాన'ంటూ దాటేసింది. అసలు ఆమె భయమేమిటో తెలుసా ? మనిద్దరం ఏకమైతే ఆమె కొంప కూలుస్తామని" అందా అమ్మాయి కోపంగా.

" ఈ అమ్మాయి నా ఫ్రెండ్ మిస్ రజిత!" అని పరిచయం చేసింది జయ. మరి కాసేపట్లో మరో పదిమందిదాకా వచ్చారు అక్కడికి. సంగతి తెలుసుకోగానే ఇంతెత్తున ఎగిరారు.

"ఎన్నిసార్లడిగినా ఒకటే సమాధానం చెప్పేది మన వార్డెన్! 'జయ రూంలోనే ఉండాలని మీకందరికీ ఎందుకంత పట్టుదల ! ఆమెలో ఏముందని అలా మీ రామె వెనకాల తిరుగుతారు. అసలా అమ్మాయి రూంలో యింకెవర్నీ వేయను' అంటూ ఎన్ని సాకులు చెప్పిందనీ. అయినా అసలు ఎవర్నని ఏం లాభం? అదృష్టం ఈ నిర్మలని వరిస్తే..." అన్నారు.

" ఆ సంగతి మీ అందరికన్నా ముందే ఆ అమ్మాయి చెప్పింది!" అంది అరుణ

" చెప్పిందీ ! చెప్పక ఏం చేస్తుందిలే ? ఈమె మాటల గారడీలో చిక్కుకున్న మహా మహా వాళ్ళమే లేవలేకపోతున్నాం ! ఈమెంత ? ఈమె లెక్కెంత ?" అంటూ చురచురా చూస్తూ వచ్చినదారే పట్టారు.

ఆ తర్వాత రెండ్రోజుల్లో నిర్మల గ్రహించిన ముఖ్యవిషయం: - హాస్టల్ వార్డెన్ కీ, జయకీ పడదనీ - ఇద్దరి మధ్యా పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుందనీ! కారణం ఏమిటో కూడా తెలుసుకుంది. ఆ వార్డెన్ గారి భర్త నెలకోసారి హాస్టల్‌కి వచ్చి రెండ్రోజులపాటు రాత్రింబవళ్ళూ హాస్టల్లోనే వుంటాడట. అది వీళ్ళకి ఇరిటేటింగ్‌గా వుంటుందట!

" ఏ ట్రావెలర్స్ బంగ్లాకో, లాడ్జ్‌కో వెళ్ళకుండా అతడెందుకిక్కడ వుండాలీ - ఇదేమైనా హాస్టలా - హోటలా - రాత్రనకా పగలనకా ఆడపిల్లల హాస్టల్‌కి రావడానికి?" అనేవాళ్ళట జయా వాళ్లు.

" మా శ్రీవారు వచ్చినపుడు మాత్రం ప్రతిసారీ నేనెందుకు బయటికి వెళ్ళాలి ! ఈ సారి ఎక్కడికీ వెళ్ళాల్సిన అవసరం లేదు - ఇక్కడికే రమ్మని లెటర్రాస్తాను!" అనేదట ఆ సంవత్సరమే పెళ్ళి చేసుకుని చదువుకుంటోన్న సునంద.

" అవునే - అలాగే రమ్మని రాయ్ ! ఎంచక్కా మీ యిద్దరికీ ఆ రూం యిచ్చేసి, నేను జయా వాళ్ళరూంకో, సెకండ్‌షోకో చెక్కేస్తాను" అనేదట ఆమె రూమ్మేటు.

ఒకరోజు... అతడా హాస్టల్‌కి రావడానికి వీల్లేదనీ, లేడీస్ హాస్టల్‌లో గోపాలకృష్ణుడిలా అతడెందుకు వుండాలనీ వార్డెన్‌కి వినపడేలా అందట జయ.

దాంతో ఛర్రుమందట వార్డెన్‌కి.

" హాస్టల్‌కి సంబంధించిన రూల్స్ నాకు తెలీనివేంకావు ! పై అధికారుల నుండి నేనా విషయంలో రిటెన్ పర్మిషన్ కూడా తెచ్చుకున్నాను. మంచీ - మర్యాదా లేకుండా ఏమిటా మాటలు ? పిల్లలంతా మరీ బరి తెగించిపోతున్నారు! ఇది వరకు పిల్లలు ఎంతో క్రమశిక్షణతో వుండేవాళ్ళు. ఈ జయ వచ్చాకే ఈ హాస్టల్ వాతావరణంలో పెద్ద మార్పు వచ్చింది! ఇలాంటి చీడపురుగుల వల్ల పిల్లలంతా చెడిపోతారు ! ఇలా అయితే ప్రిన్సిపాల్‌కి చెప్పి - బాడ్ కాండక్టు సర్టిఫికెట్ ఇప్పిస్తాను" అందట వార్డెన్.

" నా కాండక్ట్ సర్టిఫికెట్ అలా ఇప్పించడం నీ అబ్బ, నీ అబ్బకి అబ్బతరం కూడా కాదు!"అందట జయ..

"నీ చదువెంత ? నువ్వెంత ? ఆఫ్టరాల్ బియ్యే ! నీకే అంత తల పొగరుంటే నేను డబులెమ్మే, పీహెచ్డీనీ ! నాకెంతుండాలీ ?" అందట వార్డెన్.

" ఎంత చదివీ ఏం లాభం - సంస్కారం లేకపోయాక !? ఈ మాత్రం విచక్షణా జ్ఞానం లేని దానివి నువ్వు పీహెచ్డీ అంటే.. నో బడీ బిలీవ్సిట్ ! ఆ డిగ్రీలు రావడానికి ఎంతమంది కాళ్ళు పట్టావో! " అందట జయ.

అప్పట్నుండీ అన్ని విషయాల్లో ఇద్దరికీ ఏవో స్పర్థలు వస్తూనే వున్నాయట.

" ఆమె డాక్టరేటా ? డాక్టరేటయ్యుండీ ఈ హాస్టల్ వార్డెన్‌గా ఎందుకు చేరింది?" అడిగింది నిర్మల.

" ఈవిడ మన కాలేజీలో లెక్చరర్. హాస్టల్‌లో వార్డెన్. అంటే - వార్డెన్ కమ్ లెక్చరర్ అన్నమాట. ఆమె హిందీ లెక్చరర్. ఏం చెప్తుందో ఏమోగానీ... వారానికి

మూడు రోజులూ లీవే! మిగతా మూడు రోజులూ కొత్తగా పెళ్ళయిందేమో... క్లాసులో నిద్రపోవడానికే సరిపోతాయి'' అంది జయ.

'' మనిషిని చూస్తే అలా అన్పించదు! చాలా మంచిదానిలా కన్పిస్తుంది.''

'' అలాంటి వాళ్ళందరూ అలాగే కన్పిస్తారు గోముఖవ్యాఘ్రాల్లా ! ఆవిడ భర్త వరంగల్ మెడికల్ కాలేజీలో ప్రొఫెసర్. ఇద్దరికీ కలిపి నెలకి రెండువేల పైనే వస్తుంది ఆదాయం! ఆశ కాకపోతే - దొంగ లెక్కలు చూపి ఏ నలభై రూపాయలలో వచ్చే మెస్ బిల్ తొంభై చేస్తోంది.''

'' తొంభై రూపాయల మెస్ బిల్లా ? ఎస్టాబ్లిష్‌మెంట్ కాకుండానా ?''

'' ఊఁ దానికి మరో ఇరవై ఇచ్చుకోవాలి. ఇలా నెలకి నూటాపది రూపాయల మెస్‌బిల్ వస్తూంటే వూరుకోలేక కాస్త పొదుపుగా ఖర్చు పెట్టండని సలహా ఇస్తే-తారా జువ్వలా లేచింది - 'నేనేమైనా మింగుతున్నానా ? కావాలంటే మీరే చూడండీ బిల్స్' అంది.''

'' మరి చెక్ చేయకపోయారా ?''

'' మాయమాటలు చెప్పి. అసలు సంగతి దాటేసే ప్రజ్ఞావంతురాలు తను... ఎంత తెలివిగలదనుకున్నావ్ ? తన తెలివినంతా దుర్వినియోగం చేయడానికి ఉపయోగిస్తోంది గానీ - లేకపోతే ఈ పాటికి మూడో ఎమ్మేకూడా రాసేదీ.''

'' మరి ఈ విషయం మీరు పై అధికారులకి రిపోర్ట్ చేయలేకపోయారా ?''

'' ఈవిడ ఇంత ధైర్యంగా వుందంటే... ఏకంగా హాస్టల్‌కే మొగుణ్ణి తెచ్చుకుని సంసారం చేస్తోందంటే - ఆ అధికారులకీ ఈవిడకీ ఏమైనా లింక్స్ - ఐ మీన్ ఒకరి గుట్టు మరొకరి చేతుల్లో వుండివుండొచ్చనే అనుమానం కల్గుతోంది, అందుకే కాస్త తటపటాయిస్తున్నాం.''

''పోనీ ప్రిన్సిపాల్ గారికి చెప్పి చూస్తే-''

''ఏమీ లాభంలేదు. ఆవిడకీ, ఈ హాస్టల్ వ్యవహారాలకీ సంబంధంలేదు! ఈ హాస్టల్ మేనేజ్‌మెంట్ కమిటీ మెంబర్స్‌లో మన జిల్లా కలెక్టర్ ప్రెసిడెంటని తేలింది! అతడికే వెళ్ళి రిపోర్ట్ చేద్దామనుకుంటున్నాం!''

''ఒక్కర్తివే వెళ్తావా?''

'' ఇలాంటి పనుల్లో ఇంకొకరిసాయం తీసుకోను! ఇది 'తెగింపు' కదా! పట్టుబడ్తే ఒక్కదాన్నే పట్టుబడొచ్చు! అందర్నీ ఆ ఊబిలోకి దింపడం నాకిష్టం లేదు!''

''అలా కాదు ! అందరి మంచికోసం నువ్వాపని చేస్తున్నపుడు, నిన్ను మాత్రం ఒంటరిగా ఎలా పంపిస్తాం? నీకభ్యంతరం లేకపోతే తోడుగా నేనూ వస్తాను.''

''నువ్వా!?'' అడిగింది జయ ఆశ్చర్యంగా.

'' అవును, నేనే! ఎందుకలా ఆశ్చర్యపోతున్నావ్?''

''నీలో అంత ధైర్యముందా అనీ''

''అన్యాయాన్ని ప్రతిఘటించడం నా ఆశయాల్లో మొదటిది! నా మీద నువ్వు

ఎలాంటి అనుమానం పెట్టుకోకు జయా!" అంది నిర్మల స్థిరంగా.

ఇద్దరూ కలిసి కలెక్టరాఫీస్ వెళ్ళారు. ఆయనేదో మీటింగ్‌లో వున్నారు. అది అయిపోయిందాకా చూసి, అతణ్ణి కలిశారు.

" కూర్చోండమ్మా ! - ఏంకావాలీ? ఏం పనిమీద వచ్చారు?" అడిగారాయన సౌమ్యంగా.

చెప్పాల్సినవన్నీ చెప్పారు.

"అయితే మెస్‌బిల్ తొంభై రూపాయలు కాదంటారు - అంతేకదూ."

"అవునండీ".

"మీకు ఏమేమి యిస్తారు."?

" పొద్దున కాఫీ, టిఫిన్ - మధ్యాహ్నం భోజనం ! సాయంత్రం టీ ! రాత్రి మళ్ళీ భోజనం !"

" పెరుగు ఇస్తారా ?"

" మధ్యాహ్నం పెరుగు - రాత్రికి మజ్జిగ."

"ఎన్ని కూరలు"?

"ఒక చారు ! ఇంకేదైనా కూరా - మొత్తం రెండూ."

"నాన్ వెజిటేరియనా ?"

"కాదండీ - వెజిటేరియన్ మాత్రమే!"

"పొద్దున టిఫిన్‌కి ఏమిస్తారు"?

" చపాతీ, లేదా దోసే, ఒక్కోరోజు ఉప్మా."

" సరే - ఒక నెల రోజులపాటు మెస్ మీ చేతుల మీదుగా నడిపించడానికి పర్మిషన్ యిస్తాను. మరి మీరు మేనేజ్ చేయగలరా?"

"తప్పకుండా!"

" అయితే రేపే నోటీస్ పంపిస్తాను ! వెళ్ళండి".

"థాంక్సండీ! కానీ - మరో విషయం...."

" చెప్పమ్మా"?

గోపాలకృష్ణుడి సంగతి చెప్పి " అతడలా రాత్రిపూట హాస్టల్లో వుండడానికి మీరు పర్మిషన్ యిచ్చారా?" అడిగింది.

"లేదమ్మా.. నేనా విషయం కనుక్కుంటాను."

" అతడు అలా చీటికీ మాటికీ హాస్టల్లో వచ్చి వుంటున్నాడు. పిల్లలంతా అభ్యంతరం చెప్తున్నారు."

" మంచిదమ్మా - నేనా విషయం విచారిస్తాను."

" వెళ్ళొస్తామండీ! చాలాథాంక్సండీ" అంటూ బయటపడ్డారు.

భుజాలెగరెస్తూ వచ్చి, జరిగిన సంగతంతా పూరిస్తూ స్నేహితురాళ్ళతో చెప్పారు!

అందరికీ భలే సంతోషంగా వుంది. ఎప్పుడు తెల్లవారుతుందా? ఎప్పుడు వార్డెన్ కి మెమో పంపుతారా అని కాచుక్కూర్చున్నారు.

తెల్లవారింది.

వార్డెన్‌కి నోటీస్‌తోపాటు ఏదో మెమో కూడా అందినట్టుందేమో - ఆమె రూం లోంచి కేకలు విన్పిస్తున్నాయి.

" ఏ ఇడియట్ వెళ్ళి రిపోర్ట్ చేసింది ? ఈ లీలా సుందరి పగంటే పాముపగ! వీళ్ళు పరీక్షల్లో ఎలా గట్టెక్కుతారో చూస్తాను ! ఈ యూనివర్సిటీలో నాకందరూ తెలిసిన వాళ్ళే ! వాళ్ళ పేపర్స్ తారుమారు చేయించకపోతే నా పేరు లీలాసుందరే కాదు" ప్రతిజ్ఞ చేసింది.

"లీలా సుందరి కాకపోతే మరో అప్పలమ్మ! నీ ముఖానికి ఏ పేరైతేనేం!? పరీక్షల్లో ఫేల్ చేయిస్తుందట ఫేల్. అక్కడికీ పాస్ చేయడం. ఫేల్ చేయడం ఈమె అబ్బ చేతుల్లో వున్నట్లు !" రూంలో ఇంతెత్తు ఎగుర్తూ అంది జయ.

" వార్డెన్‌కి చెప్పకుండా హాస్టల్ బయటికి వెళ్ళకూడదుగా ! మీరెలా వెళ్ళారే?" అడిగింది అరుణ.

" ఇదో అడ్వెంచరా చిట్టితల్లీ !? షాపింగ్‌కి వెళ్తున్నామని పర్మిషన్ తీసుకుని కలెక్టరాఫీసుకి వెళ్ళాం!" చెప్పింది జయ.

"మంచి పని చేశారు ! ఈ దెబ్బతో ఆవిడ రోగం కుదుర్తుంది!" అనుకున్నారు అందరూ.

❋❋❋❋❋❋

హాస్టల్లో వున్న రెండు నిమ్మచెట్ల నిండా ఎక్కడ చూసినా నిమ్మకాయలే ! పిల్లలకి నోరూరుతోంది. ఎట్టి పరిస్థితుల్లోనూ నిమ్మకాయలను తెంపకూడదనీ - వాటితో ఏదో ఒకరోజు పులిహోర చేయిస్తాననీ వార్డెన్ ఆర్డర్ జారీ చేసింది.

దొంగతనంగా తెంపితే మళ్ళీ ఏం కొంప మునుగుతుందో అని చాలా రోజులదాకా ఎవరూ వాటి జోలికే వెళ్ళలేదు.

ఒక రోజు లాస్ట్ పీరియడ్ లీజరుందని - ప్రిన్సిపాల్‌ని అడిగి - కాలేజీ నుండి ఎర్లీగా వచ్చేసిన జయకు - నిమ్మకాయలు తెంపుతూ కనిపించాడు హాస్టల్ ప్యూన్.

" ఎక్కడికి తీసికెళ్తున్నావ్?" అడిగింది జయ.

"కాలేజీకమ్మా" అదేమిటో భయపడ్తూ సమాధానమిచ్చాడు.

"ఎందుకూ?"

"లీలాసుందరి అమ్మగారు తీసుకొని రమ్మన్నారు."

"దేనికోసమట?"

"అక్కడ వారు ఏదో పార్టీ యిస్తున్నారు కదమ్మా ! షర్బత్‌కి కావాలట"

"ఓహో అత్తగారి సొమ్ము అల్లుడు దానం చేయడం అన్నమాట! బావుంది!"

ప్యూన్ తెంపినవన్నీ మూట గడ్తున్నాడు.

"అన్వర్ ! ఆ నిమ్మకాయలు తీసుకెళ్ళి కిచెన్లో పెట్టు ! నువ్వవి తీసుకుని వెళ్ళడానికి వీల్లేదు!"

" అదేంటమ్మా! అమ్మగారు తీసుకుని రమ్మన్నారు."

" నేను వద్దంటున్నాను."

" ఉత్త చేతులతో వెళ్తే అమ్మగారు కోప్పడ్తారమ్మా."

" మధ్యలో నీకేం భయం ? వెళ్ళి నేనొద్దాన్నానని నా పేరు చెప్పు".

"వద్దమ్మా ! ఆవిడ అసలే మంచిమనిషి కాదు ! ఆవిడతో తగవులు పెట్టుకోకండమ్మా -పాముపగ ఆమెది !" అన్నాడు అన్వర్.

అతడికెందుకో జయ అంటే అపరిమితమైన గౌరవం.

"నాకన్నీ తెలుసు అన్వర్! ఎవర్ని ఎక్కడ ఎలా దెబ్బతీయాలో నాకు బాగా తెలుసు! వెళ్ళు ! ఏమీ జరుగదులే" చెప్పింది జయ.

"ఏమిటీ కథ?." అడిగింది అప్పుడే అటువచ్చిన అరుణ.

" ఏముందీ! ఈవిడగారు తల్లి కాబోతోందికదూ ! ఈ సందర్భాన్ని పురస్కరించుకుని స్టాఫ్కి పార్టీ యిస్తోంది. నిమ్మకాయలు కొంటే మరో పది రూపాయలు వదుల్తాయిగా - అందుకని యిక్కడ హాస్టల్లో తేరగా దొరుకుతాయని అన్వర్ని పంపింది."

"ఓహో ఇన్నాళ్ళూ మనల్ని తెంపొద్దన్నది ఇందుకోసమన్న మాట! అయినా దొంగలా ఎవరూ లేనపుడు కోసుకోవడమేమిటీ, ఇంత చదువూ చదివి? ఇదంతా హాస్టల్ సొత్తు ! అంతగా ఎక్కడా దొరక్క పోతే మా దగ్గర డబ్బులిచ్చి తీసకోమని చెప్పు!" అంది అరుణ కోపంగా.

"అట్లాగేనమ్మా" అంటూ అతడు తలూపి వెళ్ళిపోయాడు.

❋❋❋❋❋❋

ఆరోజు పొద్దున్నే పనిమనిషి లచ్చి, జయవాళ్ళ రూం వూడుస్తూ అనుకోకుండా ఎందుకో అరుణ మంచం వేపు చూసింది. మరుక్షణం లచ్చి గుండె అగిపోయినంత పనైంది !

అరుణ పక్కలో ఎవరో అబ్బాయి పడుకున్నాడు. చూడబోతే ఎవరో గొట్టంప్యాంట్ గాడులా వున్నాడు. గూర్ఖా కళ్ళు కప్పి - వాడు లోపలికి ఎలా రాగలిగాడో - ఆమెకి అర్థంకాలేదు.

వెంటనే ఆమెకి ఓ ఆలోచన తట్టింది. 'ఓ రోజు వినాయక చవితి పండుగనాడు- మామూలు అడిగితే ఆరుణ యివ్వలేదు - ఇప్పుడిది వార్డెనమ్మకి చెప్తేసరి' అనుకుని, వూడుస్తోన్న చీపురుకట్ట - అక్కడే పడేసి - గబగబా వార్డెన్ రూంలోకి వెళ్ళి - మరో అయిదు నిముషాల్లో వార్డెన్తో తిరిగొచ్చి - మంచం వేపు చూపించింది.

అరుణ ఆ గొట్టంప్యాంట్ అబ్బాయి మీద కాళ్ళువేసి కౌగిలించుకు పడుకుంది.

" అరుణా" గర్జించారు వార్డెన్ - అరుణ రెడ్‌హాండెడ్‌గా పట్టుబడ్తోందని లోలోపల సంతోషిస్తూ .

ఉలిక్కిపడి కళ్ళు నులుముకుంటూ లేచింది అరుణ.

" ఏమిటీ వేషాలు?"

"ఏమైందండీ?" లేచి నించుంటూ అమాయకంగాఅడిగింది అరుణ.

ఇంత జరిగినా ఆ గొట్టం ప్యాంట్ కదలడమేలేదు.

"ఇంకా ఏంకావాలీ! హాస్టల్ పరువూ ప్రతిష్టలు మట్టిలో కలిపింది చాలక!" అంది వార్డెన్, కొన్నాళ్ళ క్రితం దాకా తనూ అదే హాస్టల్లో సంసారంకూడా పెట్టిందన్న సంగతి మరిచి.

"ఆసలేమైందో చెప్పండి ?" చిరాగ్గా అంది అరుణ.

"ఏమైందని యింకా అడుగుతున్నావా? వాడెవడు ? ఎన్నాళ్ళ నుంచి సాగుతోందీ వ్యవహారం?" అంటూ మంచంవేపు చూపించింది.

అరుణ నిద్ర కళ్ళతోనే మంచం వేపు ఓసారీ, వార్డెన్‌వేపు ఓమారూ చూసి, చరచరా మంచం దగ్గరికి వెళ్ళి: " ఏయ్ గొట్టంప్యాంటూ ! ఇక్కడ పడుకోవద్దంటే విన్నావా? వార్డెన్ గారొచ్చారు. నిన్ను పోలీసులకు పట్టిస్తారట !" అంటూ దుప్పటి లాగేసింది.

ప్యాంటూ షర్టూ వేసుకొని నిద్రపోతోన్న జయ ఒక్కదుటున లేచి కూర్చుంది.

" ఫిఫ్టీంతాగస్ట్ కల్చరల్ ప్రోగ్రాంలో - జయ హీరో పార్ట్ తీసుకుంది ! తనకా డ్రెస్ సరిపోతుందో లేదో చూట్టానికా డ్రెస్ వేసుకుంది ! - విప్పడానికి బద్ధకమేసి-రాత్రి అలాగే నిద్రపోయింది. వెనకాముందూ ఆలోచించకుండా తొందరపడి మాటలు జారడం అంత బావుండదేమో!?" అంది అరుణ.

వార్డెన్ ముఖంలో నెత్తురుచుక్కలేదు!

(సశేషం)

**ఆంధ్రజ్యోతి వార పత్రిక 4-3-1977**